మట్టిరోడ్లు.. మురికినీరు

- మొదటివార్డు సమస్యలమయం
- కంపుకొడుతున్న పరిసరాలు
- విలీనగ్రామాల్లో తీరని వెతలు
- పెరిగిన పన్నులు.. ధరిచేరని వసతులు



ఈ చిత్రం సిరిసిల్ల మొదటివార్డులోని జ్యోతినగర్. అందంగా కనిపిస్తున్న రైతువేదిక అభివృద్ధికి చిహ్నమైతే.. పక్కనే ఉన్న డ్రెయినేజీ మౌలిక వసతుల లేమికి నిదర్శనం. చంద్రంపేట ప్రధాన రహదారిపై ఉన్న ఈ దృశ్యం ఒక్కటి చాలు వార్డులోని వసతుల గురించి తెలుసుకునేందుకు.



మట్టిరోడ్డు ఉన్న ఈ ప్రాంతం కూడా సిరిసిల్ల మొదటివార్డులోని జ్యోతినగర్. సీసీరోడ్లు వేస్తామని పాలకులు ఇచ్చిన హామీ నెరవేరడం లేదు. ఫలితంగా చిన్నపాటి వర్షానికే ఇలా చిత్తడవుతుంది.



ఈ చిత్రం మొదటివార్డులోని మరో గ్రామం రగుడు. పక్కా డ్రెయినేజీ లేక అధ్వాన్నంగా ఉంటుంది. ఫలితంగా దుర్గంధంతోపాటు దోమలు వ్యాప్తి చెందుతున్నాయి.



మొదటి వార్డు	
జనాభా	2700
ఓటర్లు	1995
గృహాలు	700

సిరిసిల్లటౌన్: మట్టిరోడ్లు.. చిన్నపాటి వర్షానికే మోకాలు లోతు గుంతలు.. పక్కా డ్రెయినేజీ లేక రోడ్లపైన ప్రవహిస్తున్న మురికినీరు.. పెరుగుతున్న దోమలతో ప్రబలుతున్న రోగాలకు కేరాఫ్‌గా నిలుస్తోంది సిరిసిల్లలోని మొదటివార్డు. ఈ వార్డులో ఒకవైపు అభివృద్ధి శరవేగంగా జరుగుతుంటే.. మరో వైపు అధ్వాన పరిస్థితులు కనిపిస్తున్నాయి. చంద్రంపేట, రగుడు, జ్యోతినగర్, పోచమ్మవీధి, స్కూల్స్ ఏరియా, సిరిసిల్ల–కరీంనగర్ ప్రధాన రోడ్డు, నిమ్మపల్లి–సిరిసిల్ల ప్రధాన రహదారి, రగుడు జంక్షన్, రగుడు గ్రామాల ఏరియాలు కలుపుకుని విస్తరించిన మొదటివార్డులో అభివృద్ధి అంతంతే ఉంది. మొదటివార్డు ప్రగతిపై ఫోకస్..

అభివృద్ధి ఇలా..

- వార్డులో వివిధ అభివృద్ధి పనులకు రూ.2.50కోట్లు వెచ్చించారు.
- ఇప్పటికే వార్డులో 2 కి.మీ. డ్రెయినేజీ, 2 కి.మీ సీసీ రోడ్లు నిర్మించారు.
- రగుడు–చంద్రంపేటకు డీఎంఎఫ్‌టీ నిధులు రూ.36 లక్షలతో రోడ్డు నిర్మించారు.
- రైతుసమస్యల పరిష్కారం కోసం రైతువేదికను రూ.72 లక్షలతో నిర్మించారు.
- రూ.20 లక్షలతో గ్యాస్ బర్నింగ్ మోడ్రన్ శ్మశాన వాటిక ఏర్పాటు చేశారు.
- జ్యోతినగర్‌లోని ప్రగతిభవన్ పునర్ నిర్మాణానికి రూ.20 లక్షల పట్టణ ప్రగతి నిధుల ద్వారా నిర్మిస్తున్నారు.
- రగుడులో రూ.6 లక్షలతో ఓపెన్‌జిమ్ ఏర్పాటు చేశారు.
- రగుడు సమీపంలో ఇళ్లు లేని నిరుపేదలకు దాదాపు 72 డబుల్ బెడ్‌రూమ్ ఇళ్లు నిర్మించారు.
- ఇటీవల పట్టణ ప్రగతి పనుల కింద వీధిదీపాలు ఏర్పాటు చేశారు.

వార్డులో ప్రధాన సమస్యలు..

- రగుడు, జ్యోతినగర్‌లలో డ్రెయినేజీ వ్యవస్థ అస్తవ్యస్తంగా ఉంది. మురుగునీరు రోడ్లపై పారుతోంది.
- అంతర్గతరోడ్లు అధ్వాన్నంగా మారాయి. ఇటీవల కురిసిన వర్షాలకు పెద్ద, పెద్ద గుంతులు పడ్డాయి.
- రైతులు పండించిన పంటను అమ్ముకునేందుకు ధాన్యం కొనుగోలు కేంద్రాలు లేక రోడ్డు పైనే ధాన్యం ఆరబెడుతున్నారు.
- జ్యోతినగర్‌లో మిషన్‌భగీరథ నీరు పైపులైన్ నిర్మాణం ఇప్పటికి చేపట్టలేదు. మిగిలిన ప్రాంతాల్లో తక్కువ సమయంలో మంచినీరు సరఫరా చేస్తున్నట్లు ప్రజలు చెబుతున్నారు.
- వార్డులో ఇద్దరు మాత్రమే పారిశుధ్య కార్మికులు ఉండడంతో శానిటేషన్ పనులు మందకొడిగా సాగుతున్నాయి.

స్పీడ్ బ్రేకర్లు లేక ప్రమాదాలు



వార్డులో వాహనాల రాకపోకలు ఎక్కువైనయి. స్పీడ్‌బ్రేకర్లు లేక అనేక ప్రాంతాల్లో ప్రమాదాలు జరుగుతున్నా యి. శ్మశానవాటిక పనులు త్వరగా పూర్తిచేయాలి. బైపాస్‌రోడ్డులో సత్వరమే వీధిదీపాలు ఏర్పాటు చేయాలి. కాలనీల్లో కొత్త స్తంభాలు పెట్టించాలి.

– రాజు, రగుడు

మంచినీళ్లకు గోసపడుతున్నం



తాగునీరు సరిపడా అందక అరిగోస పడుతున్నాం. మా ఏరియాలో మిషన్ భగీరథ కనెక్షన్లు ఇప్పటికీ లేవు. పారిశుధ్యం పనులు సరిగ్గా చేస్తలేరు. ఇళ్లపై నుంచి కరెంటు తీగలు ప్రమాదకరంగా వెళ్తున్నాయి.

– పులి సరోజన, జ్యోతినగర్

కేటీఆర్ చొరవతో అభివృద్ధి



విలీనగ్రామాలతో ఏర్పడిన మా వార్డులో మంత్రి కేటీఆర్ చొరవతో అభివృద్ధి జరుగుతోంది. వార్డులో మినీ ఫంక్షన్ హాల్ నిర్మించాం. కొత్తగా 2 కి.మీ మేరకు సీసీరోడ్లకు మంజూరు ఉంది.నాలుగేళ్లలో సుమారు రూ.2.50 కోట్లతో అభివృద్ధి పనులు పూర్తయ్యాయి. వందశాతం వసతుల కల్పనకు కృషి చేస్తాను.

– పోచవేణి సత్య, వార్డు కౌన్సిలర్

క్లుప్తంగా

మాజీ ప్రధాని పీవీకి నివాళి



నివాళి అర్పిస్తున్న నాయకులు

ఎల్లారెడ్డిపేట: మండల కేంద్రంలోని కాంగ్రెస్ కార్యాలయంలో బుధవారం మాజీ ప్రధాని పీవీ నర్సింహారావు జయంతి వేడుకలను ఆ పార్టీ నాయకులు ఘనంగా నిర్వహించారు. పీవీ చిత్రపటానికి పూలమాల వేసి నివాళి అర్పించారు. బహుభాష వేత్తగా, రాజకీయ దురంధరుడిగా, మృదుస్వభావిగా దేశానికి చేసిన సేవలను కొనియాడారు. ఈ కార్యక్రమంలో మండల అధ్యక్షుడు దొమ్మాటి నర్సయ్య, జిల్లా కార్యదర్శి లింగంగౌడ్, గిరిధర్‌రెడ్డి, నాయకులు పాల్గొన్నారు.

మహిళా సంఘ భవనానికి భూమిపూజ



భూమిపూజ చేస్తున్న జెడ్పీటీసీ మంజుల

తంగళ్లపల్లి: పల్లెలు అన్ని మౌలిక వసతులతో అభివృద్ధి చెందాలని పల్లెలు దేశానికి పట్టుకొమ్మలని చాటిచెప్పాలని జెడ్పీటీసీ పూర్మాని మంజుల అన్నారు. మండలంలోని మల్లాపూర్ గ్రామంలో మహిళా సంఘ భవన నిర్మాణానికి బుధవారం భూమిపూజ చేశారు. భవన నిర్మాణం వేగంగా పూర్తిచేయాలని అదనపు నిధులు అవసరమైతే మంత్రి కేటీఆర్‌కు విన్నవిస్తామన్నారు. కార్యక్రమంలో స్థానిక సర్పంచ్ సావనపల్లి పర్శరాములు, ఎంపీటీసీ గుగ్గిళ్ల లావణ్య, జిల్లా క్రికెట్ అసోసియేషన్ అధ్యక్షుడు పూర్మాని రాంలింగారెడ్డి, వార్డు సభ్యులు, మహిళా సంఘం నాయకులు, మహిళలు, గ్రామస్తులు పాల్గొన్నారు.

బస్సు సౌకర్యం కల్పించాలని విద్యార్థుల రాస్తారోకో



ఆందోళన చేస్తున్న విద్యార్థులు

కోనరావుపేట: మండల కేంద్రంలోని మోడల్ స్కూల్ వెళ్లేందుకు సమయానికి బస్సు రావడం లేదని, దీంతో ఇబ్బందులు పడుతున్నామంటూ బావుసాయిపేటలో విద్యార్థులు బుధవారం రహదారిపై బైఠాయించి ఆందోళన చేపట్టారు. బావుసాయిపేట, వెంకట్రావుపేట గ్రామాల నుంచి చాలామంది విద్యార్థులు కోనరావుపేట మండల కేంద్రంలోని ఆదర్శ పాఠశాలలో చదువుకుంటున్నారన్నారు. రెండు రోజులుగా బస్సు రావడంలేదన్నారు. పంచాయతీ పాలకులు, ఆర్టీసీ అధికారులు తగిన చర్యలు తీసుకుని తమ సమస్యను పరిష్కరించాలని కోరారు.

ఇంటింటికీ బీజేపీ ప్రచారం



ముస్తాబాద్/గంభీరావుపేట: ముస్తాబాద్ మండలంలోని వెంకట్రావుపల్లె, గంభీరావుపేట మండలం కొత్తపల్లిలో ఇంటింటికీ బీజేపీ కార్యక్రమాన్ని ఆదివారం నిర్వహించారు. తొమ్మిదేళ్ల బీజేపీ పాలనలో చేపట్టిన అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలను ప్రజలకు వివరించారు. కార్యక్రమంలో బీజేపీ మండల అధ్యక్షుడు కస్తూరి కార్తీక్‌రెడ్డి, గంట అశోక్, అగ్రహారం శేఖర్, బీజేవైఎం జిల్లా ఉపాధ్యక్షుడు పెద్దూరి పర్శాగౌడ్, కిసాన్ మోర్చా మండల అధ్యక్షుడు కోడె రమేశ్, తదితరులు పాల్గొన్నారు.

సీఎం కేసీఆర్ చిత్రపటానికి క్షీరాభిషేకం



క్షీరాభిషేకం చేస్తున్న బీఆర్ఎస్ నాయకులు

తంగళ్లపల్లి: మండలంలోని బద్దెనపల్లి–సారంపల్లి టెక్స్‌టైల్ గేటు ఎదుట బీఆర్ఎస్ నాయకుల ఆధ్వర్యంలో బుధవారం సీఎం కేసీఆర్, మంత్రి కేటీఆర్ చిత్రపటాలకు క్షీరాభిషేకం చేశారు. ఈ సందర్భంగా బీఆర్ఎస్ జిల్లా సీనియర్ యూత్ నాయకుడు సిలివేరి చిరంజీవి మాట్లాడుతూ రైతుబంధు కొరకు రైతుల ఖాతాల్లో ఎకరానికి రూ.5 వేలు చొప్పున 10 వేల రైతుల ఖాతాల్లో పెట్టుబడి సాయంగా అందించినందుకు కృతజ్ఞతలు తెలిపారు. రైతును రాజును చేయడమే సీఎం కేసీఆర్ లక్ష్యమని అన్నారు. కార్యక్రమంలో రైతు సెల్ మండల ఉపాధ్యక్షుడు కొక్కిరాల ఆగం రావు, సీనియర్ నాయకుడు శ్యాగ దేవేందర్, ఇమ్మనేని అమర్ రావు, పయ్యావుల వినయ్, చెన్నమనేని రాజేశ్వరరావు, శ్రావణ్, ఎండీ.భాషీయా, షాదుల్లా, భూమయ్య, రవి, మల్లేశం, దేవయ్య పాల్గొన్నారు.

పోస్టల్ మేళా



పాలసీలు సేకరిస్తున్న పోస్టల్ సిబ్బంది

బోయినపల్లి: మండలంలోని తడగొండ గ్రామంలో బుధవారం బీపీఎం కట్ట కిరణ్ ఆధ్వర్యంలో ఇంటింటి పోస్టల్ మేళా నిర్వహించారు. ఈ సందర్భంగా పోస్టల్ సిబ్బంది ఇంటింటికి తిరుగుతూ రూ.399 పోస్టల్ ప్రమాద బీమా (టాటా ఆక్సిడెంట్ గార్డ్) పాలసీలు సేకరించారు. తక్కువ ప్రీమియం చెల్లించి చేసిన పాలసీతో అనుకోకుండా ప్రమాదంలో మరణిస్తే ఎక్కువ లబ్ధి చేకూరుతుందని వివరించారు. కార్యక్రమంలో బీపీఎంలు చిందం శశి, పాల్గొన్నారు.

బోనమో పోచమ్మ



సిరిసిల్లలో బోనాలతో మహిళల ఊరేగింపు



బోయినపలిలో..

సిరిసిల్లటౌన్/వేములవాడఅర్బన్/బోయినపల్లి: ఆషాఢమాసం మహిళలు పోచమ్మను భక్తి ప్రపత్తులతో కొలిచారు. బుధవారం అంబేడ్కర్ సంఘం, వేములవాడ మండలం అనుపురం, బోయినపల్లి మండలంలోని కొదురుపాక ఆర్అండ్ఆర్‌కాలనీ మహిళలు వందలాది సంఖ్యలో మహిళలు నెత్తిన బోనాలతో ఊరేగింపుగా ఆలయానికి వెళ్లి మొక్కులు తీర్చుకున్నారు. సిరిసిల్ల కౌన్సిలర్ ఆకునూరి విజయనిర్మల, కాంగ్రెస్ ఎస్సీ సెల్ జిల్లా అధ్యక్షుడు ఆకునూరి బాలరాజు, బీఆర్ఎస్ యూత్ నాయకుడు కత్తెర వరుణ్, బోయినపల్లి జెడ్పీటీసీ కత్తెరపాక ఉమ, వైస్‌ఎంపీపీ కొనుకటి నాగయ్య, వెంకట్రావుపల్లి సర్పంచు బూర్గుల నందయ్య బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు కత్తెరపాక కొండయ్య, వేములవాడ జెడ్పీటీసీ మ్యాకల రవి, సర్పంచ్ వెంకటరమణారావు పాల్గొన్నారు.

అడవిలో చేసే పనులకు ఎన్‌వోసీ తీసుకోవాలి

- అడిషనల్ డీఆర్డీవో మదన్‌మోహన్



మాట్లాడుతున్న అడిషనల్ డీఆర్డీవో మదన్‌మోహన్

వీర్నపల్లి: ఉపాధి హామీ పథకం కింద అడవిలో పనులు చేసినప్పుడు అటవీ శాఖ అధికారులతో ఎన్‌వోసీ తీసుకోవాలని అడిషనల్ డీఆర్డీవో మదన్ మోహన్ అన్నారు. మండలంలోని రైతు వేదికలో బుధవారం నిర్వహించిన ఉపాధి హామీ ప్రజావేదికలో ఆయన పాల్గొని మాట్లాడారు. ప్రతి గ్రామంలో ఎవెన్యూ ప్లాంటేషన్ బాగుందని అన్నారు. మొక్కలకు నీరందించేందుకు వినియోగిస్తున్న ట్రాక్టర్లకు సంబంధించిన రికార్డులు విధిగా ఆయా గ్రామ పంచాయతీలో నిర్వహించాలి. ఈ సందర్భంగా 17 గ్రామ పంచాయతీల్లో పథకం కింద 2020 నవంబర్ నుంచి మార్చి 2023 వరకు జరిగిన పనులకు గాను అయిన రూ.13.80 కోట్ల ఖర్చుకు సంబంధించిన వివరాలను చర్చించారు. రూ.9.84 కోట్లు కూలీలకు చెల్లించినట్లు తెలిపారు. పశువుల పాకకు, కంపోస్ట్ షెడ్, ట్యాంకర్‌కు రూ.3.95 కోట్లు వెచ్చించినట్లు తెలిపారు. కోవిడ్ సమయంలో ఉపాధి హామీ పనులు నిర్వహించిన కూలీలకు మస్టర్‌లో హాజరు వేయలేదని మండలంలో కార్యదర్శులకు రూ.20 వేలు జరిమానా విధించారు. కార్యక్రమంలో ఎస్‌పీఎం దత్త, ఎస్ఆర్పీ తిరుపతి, సోషల్ ఆడిట్ రామారావు, ఎంపీడీవో నరేశ్‌కుమార్ పాల్గొన్నారు.

మహిళా సాధికారతకు పెద్దపీట



సర్టిఫికెట్లు అందిస్తున్న వికాస్‌రావు, దీప

కోనరావుపేట: మహిళా సాధికారతకు పెద్దపీట వేస్తున్నట్లు ప్రతిమ ఫౌండేషన్ బాధ్యులు చెన్నమనేని వికాస్‌రావు–దీప అన్నారు. మండలంలోని నాగారంలో మాజీ గవర్నర్ విద్యాసాగర్‌రావు చొరవతో, ప్రతిమ, జీఎమ్మార్ వరలక్ష్మి ఫౌండేషన్‌ల ఆధ్వర్యంలో నడుస్తున్న శిక్షణ కేంద్రంలో యువతీ యువకులకు సర్టిఫికెట్లు అందజేసి మాట్లాడారు. 2017 సెప్టెంబర్‌లో ప్రారంభమైన శిక్షణ కేంద్రంలో ఇప్పటి వరకు 884 మందికి వృత్తి విద్యా నైపుణ్యతలో శిక్షణ అందించి 784 మందికి ఉపాధి అవకాశాలు కల్పించినట్లు తెలిపారు. శిక్షణ కేంద్రంలో ఉచిత భోజన వసతి, కంప్యూటర్ శిక్షణ, యోగా, క్రీడా నైపుణ్యం అందించడం జరుగుతుందన్నారు. ఇలాంటి శిక్షణ కేంద్రాలు ప్రతి మండలంలో ఏర్పాటు చేయాలన్నారు. ఆత్మవిశ్వాసంతో పనిచేస్తే ఉన్నత శిఖరాలకు చేరుకోవచ్చారు. కార్యక్రమంలో ఫౌండేషన్ బాధ్యులు కౌశిక్, శిక్షకుడు మహేశ్ పాల్గొన్నారు.

కళాకారుడికి డీపీఆర్‌వో పరామర్శ

తంగళ్లపల్లి: మండలంలోని ఓబులాపూర్ గ్రామానికి చెందిన తెలంగాణ సాంస్కృతిక సారథి కళాకారుడు గడ్డం శ్రీనివాస్‌ను బుధవారం జిల్లా పౌర సంబంధాల శాఖ అధికారి (డీపీఆర్‌వో) మామిండ్ల దశరథం పరామర్శించారు. శ్రీనివాస్ ఇటీవల కాలికి గాయమై చికిత్స పొందుతున్నారు. డీపీఆర్‌వో మాట్లాడుతూ గాయం పూర్తిగా తగ్గేవరకు మెరుగైన చికిత్సతోపాటు విశ్రాంతి తీసుకోవాలని సూచించారు.

విద్యాభివృద్ధికి కృషి

- డీఐఈవో మోహన్



జయవర్ధన్‌ను సన్మానిస్తున్న డీఐఈవో మోహన్

ఎల్లారెడ్డిపేట(సిరిసిల్ల): విద్యాభివృద్ధికి స్వచ్ఛంద సంస్థలు, విద్యావేత్తలు ముందుకొచ్చి సహకారం అందించడం అభినందనీయమని జిల్లా ఇంటర్మీడియెట్ విద్యాధికారి(డీఐఈవో) మోహన్ పేర్కొన్నారు. ఎల్లారెడ్డిపేట ప్రభుత్వ జూనియర్ కళాశాలలో నూతనంగా విద్యార్థుల కోసం ఏర్పాటు చేసిన గ్రంథాలయానికి తెలంగాణ గ్రాడ్యుయేట్స్ అసోసియేషన్(టీజీఏ) జిల్లా అధ్యక్షుడు చిలుముల జయవర్ధన్ పుస్తకాలను బుధవారం అందించారు. అధ్యాపకులు పర్శరాములు, అనిల్ తదితరులు పాల్గొన్నారు.

బాపు సేవలు మరువలేనివి



వెంకట్‌రెడ్డికి నివాళి అర్పిస్తున్న నాయకులు

ఎల్లారెడ్డిపేట: సిరిసిల్ల బ్లాక్ కాంగ్రెస్ కమిటీ అధ్యక్షుడు, మాజీ ఎంపీపీ, మాజీ సర్పంచ్ నేవూరి వెంకట్‌రెడ్డి(బాపు) సేవలు మరువలేనివని పలువురు వక్తలు అన్నారు. ఆయన 9వ వర్ధంతి సందర్భంగా బుధవారం వికలాంగుల సంక్షేమ సంఘం, కాంగ్రెస్, బీఆర్ఎస్ నాయకులు ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళి అర్పించారు. ఈ సందర్భంగా మండల వికలాంగుల సంక్షేమ సంఘం ప్రతినిధి అల్లం లక్ష్మణ్ మాట్లాడుతూ స్థానిక సర్పంచ్‌గా గ్రామాభివృద్ధి కోసం తన వ్యవసాయభూమితో పాటు ఇంటిని విక్రయించి ప్రజాసేవ చేసిన గొప్ప వ్యక్తి అన్నారు. వచ్చే వర్ధంతిలోగా పాత బస్టాండ్ నెహ్రూ విగ్రహం పక్కన వెంకట్‌రెడ్డి విగ్రహాన్ని ఏర్పాటు చేస్తానని ప్రకటించారు. సింగిల్‌విండో చైర్మన్ గుండారపు కృష్ణారెడ్డి, ఉపసర్పంచ్ ఒగ్గు రజిత, పట్టణ అధ్యక్షుడు బాల్‌రెడ్డి, కాంగ్రెస్ మండల అధ్యక్షుడు దొమ్మాటి నర్సయ్య, లక్ష్మారెడ్డి, నాయకులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

సంక్షిప్త వార్తలు

గోరింటాకు వేడుకలు

రుద్రంగి: ఆషాడమాసం పురస్కరించుకొని మండల కేంద్రంలోని కృష్ణవేణి టాలెంట్ స్కూల్‌లో బుధవారం గోరింటాకు వేడుకలు నిర్వహించారు. ప్రిన్సిపాల్ హరినాథ్‌రాజు, కరస్పాండెంట్ ఎలిగేటి నరేశ్, డైరెక్టర్లు తీపిరెడ్డి వెంకట్‌రెడ్డి, ఎర్రం గంగ నర్సయ్య, పడాల సురేశ్ పాల్గొన్నారు.

కౌశిక్‌రెడ్డి బహిరంగ క్షమాపణ చెప్పాలి

ఎల్లారెడ్డిపేట: బీసీ వర్గానికి చెందిన కెమెరామెన్ బండి అజయ్‌పై దుర్భాషలాడిన ఎమ్మెల్సీ పాడి కౌశిక్‌రెడ్డి బేషరతుగా బహిరంగ క్షమాపణ చెప్పాలని మండల బీసీ సంక్షేమ సంఘం అధ్యక్షుడు కంచర్ల రాజు డిమాండ్ చేశారు.

పిల్లలకు ఉచిత గుండె వైద్య శిబిరం

సిరిసిల్లటౌన్: హిమాన్షి పిల్లల దవాఖాన ఆధ్వర్యంలో బుధవారం సిరిసిల్లలో ఉచిత మెగా వైద్య శిబిరాన్ని మున్సిపల్ చైర్‌పర్సన్ జిందం కళ ప్రారంభించారు. 60 మంది పిల్లలకు గుండె సంబంధిత వ్యాధులను గుర్తించి వారికి సలహాలను ఇచ్చారు.

మాతా శిశురక్షణకు కృషి చేయాలి

ముస్తాబాద్: మాతా శిశురక్షణకు ప్రభుత్వం అమలు చేస్తున్న పథకాలను పారదర్శకంగా అమలు చేయాలని ఐసీడీఎస్ సూపర్‌వైజర్ కళావతి అన్నారు. మండలంలోని నామాపూర్‌లో ఐసీడీఎస్ సెక్టార్ సమావేశం బుధవారం జరిగింది. అంగన్‌వాడీ కేంద్రాల్లో సమయపాలన పాటించాలన్నారు. ఆరోగ్యలక్ష్మి పథకంలో భాగంగా అందిస్తున్న పౌష్టికాహారాన్ని లబ్ధిదారులకు అందజేయాలన్నారు.

సీఎంఆర్‌ఎఫ్ చెక్కులు పంపిణీ

ఎల్లారెడ్డిపేట: మండల కేంద్రంలో లబ్ధిదారులకు సీఎంఆర్‌ఎఫ్ చెక్కులను ఎంపీపీ రేణుక, జెడ్పీటీసీ లక్ష్మణ్‌రావు పంపిణీ చేశారు. పట్టణ అధ్యక్షుడు బాల్‌రెడ్డి, సెస్ డైరెక్టర్ కృష్ణహరి, సింగిల్‌విండో చైర్మన్ కృష్ణారెడ్డి, ఎంపీటీసీ నాగరాణి పాల్గొన్నారు.

నోటుబుక్స్ పంపిణీ

సిరిసిల్లఅర్బన్: సిరిసిల్ల పట్టణంలోని 13వ వార్డు వడ్డెర కాలనీలో విద్యార్థులకు కౌన్సిలర్ జాగీరు శైలు నోటుబుక్స్ అందజేశారు. అర్బన్ బ్యాంక్ డైరెక్టర్ నేరేళ్ల శ్రీకాంత్ పాల్గొన్నారు.

ప్రైవేట్ నుంచి సర్కార్ బడికి

- రికార్డు స్థాయిలో కొత్త అడ్మిషన్లు
- ఎల్లారెడ్డిపేట మండలంలో కొత్తగా చేరిన 172 మంది
- కొనసాగుతున్న అడ్మిషన్లు
- కలిసొచ్చిన బడిబాట, మౌలిక వసతులు



నూతనంగా పాఠశాలలో చేరిన విద్యార్థులు

ఎల్లారెడ్డిపేట(సిరిసిల్ల): ప్రభుత్వ పాఠశాలలను బలోపేతం చేసే లక్ష్యంతో ఉపాధ్యాయులు, ప్రజాప్రతినిధులు చేపట్టిన బడిబాట సత్ఫలితాలనిచ్చింది. మనఊరు–మనబడి ద్వారా పాఠశాలల్లో చేపట్టిన అభివృద్ధి పనులు, మౌలిక వసతులు కలిసొచ్చాయి. ఈ విద్యాసంవత్సరంలో సర్కార్ బడులలో తమ పిల్లలను చేర్పించేందుకు తల్లితండ్రులు స్వచ్ఛందంగా ముందుకొచ్చారు. ఎల్లారెడ్డిపేట మండల కేంద్రంలోని జెడ్పీ ఉన్నత పాఠశాలలో రూ.8.50 కోట్లతో ఆధునిక వసతులు కల్పించడంతో ఏకంగా మండలంలోనే అత్యధికంగా 65 మంది విద్యార్థులు కొత్తగా అడ్మిషన్లు తీసుకున్నారు. ఎల్లారెడ్డిపేట మండల వ్యాప్తంగా ఈ విద్యాసంవత్సరంలో ఇప్పటి వరకు 172 మంది విద్యార్థులు కొత్తగా ప్రవేశాలు పొందారు. ఎల్లారెడ్డిపేట, బండలింగంపల్లి, రాచర్లబొప్పాపూర్, వెంకటాపూర్ ఉన్నత పాటశాలలు, ఎల్లారెడ్డిపేట మండల ప్రాథమిక, రాచర్లగొల్లపలి అంబేడ్కర్‌నగర్, రాచర్లబొప్పాపూర్ ప్రాథమిక పాఠశాలల్లో రికార్డు స్థాయిలో కొత్తగా విద్యార్థులు ప్రవేశాలు పొందారు.

అత్యధికంగా ఎల్లారెడ్డిపేటలో 65 మంది

ఎల్లారెడ్డిపేట మండల కేంద్రంలోని జెడ్పీ ఉన్నత పాఠశాలలో 65 మంది విద్యార్థులు ప్రైవేట్ పాఠశాలల నుంచి వచ్చి చేరారు. బడిబాటలో తల్లిదండ్రులకు ఉపాధ్యాయులు కల్పించిన నమ్మకం.. ప్రజాప్రతినిధులు ఇచ్చిన భరోసా కలిసొచ్చింది. తాజాగా బుధవారం మరో 12 మంది విద్యార్థులు ప్రవేశాలు పొందినట్లు హెచ్ఎంలు దబ్బెడ హన్మండ్లు, కుబేరాస్వామి తెలిపారు. ఆరో తరగతిలో పరిమితికి మించి 40 మంది విద్యార్థులు కొత్తగా చేరినట్లు చెప్పారు.

కార్పొరేట్ స్థాయిలో బోధన



కార్పొరేట్‌కు దీటుగా సర్కార్ బడులను అన్ని హంగులతో తీర్చిదిద్ది అదే స్థాయిలో విద్యా బోధన చేస్తున్నాం. పాఠశాలల ప్రారంభానికి ముందుగా నిర్వహించిన బడిబాట కలిసొచ్చింది. ఉపాధ్యాయులు ఇంటింటా తిరిగి తల్లిదండ్రులకు ఇంగ్లిష్ మీడియంలో బోధనపై అవగాహన కల్పించాం. ప్రభుత్వ ఉపాధ్యాయుల బోధనపై నమ్మకం కల్పించాం. ఈ విద్యాసంవత్సరంలో గతంలో ఎన్నడూ లేని విధంగా మండలవ్యాప్తంగా 172 కొత్త అడ్మిషన్లు వచ్చాయి.

– దూస రఘుపతి, ఎంఈవో, ఎల్లారెడ్డిపేట

డబుల్ బెడ్రూమ్ ఇళ్ల కోసం పోరాటం



మాట్లాడుతున్న మూషం రమేశ్

వేములవాడ: వేములవాడ నియోజకవర్గంలో పేదలకు ఇవ్వాల్సిన డబుల్ బెడ్‌రూమ్ ఇళ్ల కోసం జూలై 5 నుంచి పోరాడుతామని సీపీఎం జిల్లా కార్యదర్శి మూషం రమేశ్ పేర్కొన్నారు. వేములవాడలో బుధవారం విలేకరులతో మాట్లాడారు. ఆర్డీవో కార్యాలయం ముందు పెద్ద ఎత్తున ధర్నా చేపడతామన్నారు. డబుల్ బెడ్‌రూమ్ ఇళ్లు అందనివారు ఉదయం 10 గంటలకే ఆర్డీవో కార్యాలయానికి చేరుకోవాలని కోరారు. సీపీఎం జిల్లా కమిటీ సభ్యులు ఎల్లారెడ్డి, నాయకులు మల్లారపు ప్రశాంత్, గురజాల శ్రీధర్ పాల్గొన్నారు.

సాక్షి దినపత్రికలో ప్రకటనల కోసం మీ ప్రాంతంలో మా ప్రతినిధులు అందుబాటులో ఉన్నారు.
వివాహ, జన్మదిన, పదవీ విరమణ శుభాకాంక్షలు | వ్యాపార, ఉద్యోగ, బహిరంగ ప్రకటనలు | శ్రద్ధాంజలి, నిర్యాణము, వర్ధంతి మొదలగు
అన్ని రకాల ప్రకటనలు ఇవ్వదలిచిన వారు సంప్రదించండి.
సిరిసిల్ల జిల్లా: 9951602934, 9010610963
Office mail : knrjagati@gmail.com

సాక్షి పాఠక మహాశయులకు విజ్ఞప్తి
మీకు సాక్షి దినపత్రిక అందడంలో ఏమైనా ఇబ్బందులున్నా, లేక సాక్షికి బదులుగా ఇతర దిన పత్రికలు వేస్తున్న యెడల ఈ ఫోన్ నంబర్లకు ఉదయం 7.00 గం॥ల నుండి రాత్రి 8.00 గం॥ల లోపు తెలుపగలరు. వెంటనే తగు చర్యలు తీసుకోబడును.
రమేష్, ACO - 7997958214
సిరిసిల్ల : రఘు - 7331119957
వేములవాడ : నవీన్ - 7997958211
టోల్ ఫ్రీ నెం. : 1800 425 9899